# కామ్రేడ్ మధుకు విప్లవ నివాళులు

**విప్లవ** మేధావి, సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు, ఆ పార్టీ కేంద్రపత్రిక 'క్లాస్‌స్ట్రగుల్' సంపాదకులు కా॥మధు (78 సం॥లు)కు సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి కేంద్రకమిటి విప్లవజోహార్లర్పిస్తోంది. సిపిఐ(ఎం-ఎల్) పార్టీశ్రేణులకు, కా॥మధు జీవిత భాగస్వామి కా॥పద్మకు, వారి కుమార్తె కా॥అజితకు తీవ్ర సంతాపాన్ని తెలియపరుస్తోంది. దీర్ఘకాలంగా తనతో సన్నిహితంగా పనిచేసిన కామ్రేడ్‌ను కోల్పోవటంపట్ల ప్రత్యేకించి కామ్రేడ్ విశ్వంకు మా హృదయపూర్వక సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాము. అతితక్కువ కాలవ్యవధిలో సిపిఐ(ఎం-ఎల్) సంస్థలో చురుగ్గా సిద్ధాంత, రాజకీయ కృషి సాగించే కామ్రేడ్స్ జస్వంత్, మధుల అకాల మరణాలు, ఆ సంస్థకు మాత్రమేగాక, మొత్తంగా భారత విప్లవోద్యమానికే నష్టం. వారు తమ విలువైన యవ్వనాన్ని, తమ జీవితాల్ని విప్లవపార్టీ నిర్మాణంకోసం సంపూర్తిగా అంకింతం చేశారు. భారత ప్రజల విముక్తికోసం వారు ప్రదర్శించిన మనోనిబ్బరం, అంకితభావం ఆదర్శప్రాయమైనవి. ఐక్యత-చీలికలు-తిరిగి ఐక్యతాక్రమంలో విప్లవోద్యమానికి కా॥మధు అందించిన తోడ్పాటు విస్మరింపవీలులేనిది. విప్లవ సంస్థల ఐక్యతకోసం కా॥మధు ప్రయత్నాలను తిరుగులేని అంకితభావంతో కొనసాగించటమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి.

కల్లోల దశాబ్దానికి చెందిన విప్లవ పుత్రుడు కా॥మధు. కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు నాయకత్వంలో విప్లవ విద్యార్థిగా ఆయన తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. తదనంతరం ఆయన యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి కార్యదర్శి అయ్యారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి కార్యదర్శివర్గ సభ్యునిగా 2021 ఏప్రిల్ 16 తెల్లవారుఝామున అంతిమశ్వాస విడిచేవరకూ ఆయన విప్లవకర జీవితం కొనసాగింది. ఆయన వీరోచిత తెలంగాణాలోని పాలమూరుజిల్లాలో జన్మించి, తన 15వ ఏటనే ఎర్రజెండాను గట్టిగా ఎత్తిపట్టారు. చిరుద్యోగం చేస్తూ న్యాయశాస్త్ర విద్యను అభ్యసించినప్పటికీ, ఆయనకు పార్టీ జీవితం తప్ప వ్యక్తిగత జీవితం లేదు. 1973లో యుసిసిఆర్(ఎం-ఎల్) రాష్ట్రకమిటి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, ఆయన తన తుదిశ్వాస వరకూ పార్టీ బాధ్యతల నిర్వహణలోనే నిమగ్నమైవున్నారు.

సిపిఐ(ఎం-ఎల్) రెసిస్టెన్స్, సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీలతో ద్విపక్ష, త్రైపాక్షిక ఐక్యతాచర్చల సందర్భంగా యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి కార్యదర్శిగా కా॥మధు నిర్వహించిన పాత్ర, అందించిన తోడ్పాటు మరచిపోలేనివి. ఈ చర్చలు అంతిమంగా కొన్ని తీసివేతలు, మరికొన్ని కలయికలతో అనేక ఇతర గ్రూపులతో ఐక్యతా చర్చలకు, అంతిమంగా 7 విప్లవసంస్థల ఐక్యతతో సిపిఐ(ఎం-ఎల్) ఆవిర్భావానికి దోవతీసింది. సిపిఐ(ఎం-ఎల్)జనశక్తి కేంద్రకార్యదర్శివర్గ సభ్యునిగా, ఒడిషా రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా వున్న 1996 కాలం వరకు మేము కామ్రేడ్ మధుతో కలిసి పనిచేశాము. చీలికకు దోవతీసిన రాజకీయ, నిర్మాణపర విబేధాలు ప్రాథమికంగా కొన్ని వున్నప్పటికీ, ఐక్యతకోసం సాగించిన ప్రయత్నాలు, భవిష్యత్తులో విప్లవకారుల ఐక్యతకు పలు గుణపాఠాలందించేవిగా వుంటాయని చెప్పటం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. భారత కమ్యూనిస్టు ఉద్యమం గతితార్కిక పద్ధతిలో ఐక్యత-పోరాటం-ఐక్యతల గుండా ఒకే ఒక్క ఐక్యవిప్లవ పార్టీని స్థాపించి

నప్పుడు మాత్రమే, కా॥మధుతో సహా వేలాదిమంది అమరవీరుల త్యాగాలకు సార్ధకత చేకూర్చిన వారమౌతాం. భారత పీడిత ప్రజల కలలను అపుడు మాత్రమే సాకారం చేయగలుగుతాం.

జోహార్ కామ్రేడ్ మధు! అమరవీరుల ఆకాంక్షలను సాధించుదాం!

**విప్లవాభినందనలతో**

**2021 ఏప్రిల్ 20**

**చంద్ర ప్రకాష్, ప్రధాన కార్యదర్శి**
**సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి**